## వనభోజన యాత్రను ప్రారంభం

అడ్డగుట్ట, న్యూస్‌టుడే: అడ్డగుట్టలోని తుకారాంగేట్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాసం వనభోజన యాత్రను కార్పొరేటర్ విజయకుమారి ప్రారంభించారు. వరంగల్ జిల్లా ఘనపూర్‌లో పాలకుర్తి శ్రీలక్ష్మి నర్సింహస్వామి దేవాలయానికి ఆదివారం నాలుగు బస్సుల్లో యాత్రగా బయలుదేరారు. ప్రాజెక్టు చైర్మన్ డి.శ్రీనివాస్, వీరేశం, లక్ష్మణ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ముషీరాబాద్

# పేదల ఆకలి తీర్చడమే... లక్ష్యంగా.. సుఖీభవ



మంత్రి లక్ష్మారెడ్డితో సుధాకర్.

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆకలితో అలమటించే పేదలకు ఆకలి తీర్చడానికి నేనున్నానంటాడు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టడంలో తనవంతుగా సేవాకార్యక్రమాలు చేస్తున్నాడు. పేదలకు సేవచేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. గాంధీనగర్‌లో నివసించే సుధాకర్. సేవాకార్యక్రమాలను చేపట్టేందుకు సుఖీభవ ట్రస్టును ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తున్నాడు. ఎవరి సహాయం లేకుండానే తాను సంపాదించిన దాంట్లో కొంత పేదల ఆకలి తీర్చడానికి ఖర్చు చేస్తున్నానంటున్నాడు.

### పేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా...

గాంధీనగర్‌లో నివసించే సుధాకర్ దేవాలయానికి వెళ్లినప్పుడు ఆకలితో అలమటించే పేదలను చూసి చలించిపోయానంటున్నాడు. అన్నార్థుల ఆకలి తీర్చడానికి ఏదో ఒకటి చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగానే సుఖీభవట్రస్టును ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను నిర్విరామంగా జరుపుతున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి గాంధీఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల ఇబ్బందులను తెలుసుకొని అన్నదానం చేయాలని తలపించారు. దీంతో గాంధీ ఆసుపత్రి వైద్యాధికారులను సంప్రదించడంతో ఆసుపత్రి ప్రాంగణంలోని ఆశ్రమంలో అన్నదానం చేయడానికి అనుమతించారు. వైద్య ఆరోగ్యశాఖామంత్రి డా. లక్ష్మారెడ్డి చేతులమీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

### సామాజిక సేవే లక్ష్యంగా...

ఇంతలా సేవా కార్యక్రమాలు, అన్నదానం చేస్తున్న సుధాకర్ ధనవంతుడు ఏమీ కాదు. గాంధీనగర్‌లోని వై జంక్షన్ సమీపంలో స్టేషనరీని నడిపిస్తూ వచ్చిన ఆదాయంలోనే కొంత సేవాకార్యక్రమాలకు కేటాయిస్తున్నారు. ప్రతి రోజు ఆసుపత్రిలోని రోగుల సహాయకులు 200 మందికిపైగా అన్నదానం చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. రజని తన భర్త సుధాకర్‌కు తనవంతు సహాయంగా చేదోడువాదోడుగా పనిచేస్తూ తనవంతు సహాయ సహకారాలు అందజేస్తుంది. ఇంట్లోనే వంటలు తయారు చేసి ఆసుపత్రికి తీసుకెళ్తున్నారు. దీనికోసం వంట సామాగ్రితో పాటు ఒక మినీవ్యాన్‌ను కూడా కొనుగోలు చేశారు. డాక్టర్ల సహాయంతో మురికివాడలు, బస్తీలలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు.



ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్న సుధాకర్.